కథానిక

# మురికిలో సీతలు

పేకుమళ్ల కామేశ్వరరావు

సీతానాధరావు రోడ్డుపక్కని చప్టామీద కనిపెట్టుకొని నిల్చున్నాడు. ఆ పక్కనే బస్సులు ఆగే స్టేజి ఉంది మధ్యాహ్నం రెండు గంటలయింది. రోడ్డుమీది తారు ఉడుకుతూంది. చప్టామీద చెట్టే లేకపోతే అక్కడ నిలవ నీడే లేకపోను.

ఆ నీడలో ఒక ముసలమ్మ చిన్న జంగిడి పెట్టుకు కూర్చుంది. ఉడికించిన కర్ర పెండలం ముక్కలు, బోండాలు, అనుపగుగ్గిళ్లు ఉన్నాయి. ముసలమ్మ ఒక కర్రకి చిన్న గుడ్డముక్క కట్టి ఆడిస్తూంది, అది ఈగలు వాలకుండా కాస్తూంది; పైనుంచి కాకులు, గద్దలు తన్నుకు పోకుండా అడ్డుతూంది. సీతానాధరావుకి నవ్వు వచ్చింది. "ఇవి ఎవరు కొనుక్కొని తింటారబ్బా!" ఆమె పేదతనాన్ని ఊహించుకొంటూంటే విచారం కలిగింది. ఇంతటిలో రెండెడ్ల బండి ఆ చెట్టు నీడకోసం చప్టామీదికి వచ్చింది. బండిలో ఉన్న ఇద్దరూ, ఎడ్లను విప్పి ఇంతగడ్డి పడవేసి, ఇంతగడ్డి పరుచుకొన్నారు. ఒకడు కూర్చున్నాడు, మరొకడు నడుం వాల్చేడు. ఎదుటనే రోడ్డు అవతలివైపు పెద్ద మేడ ఉంది. అది ఒక కంపెనీ తాలూకు ఆఫీసు. దానిలోనే ఇప్పటి ప్రొప్రయిటరయిన ధనంజయమూర్తి ఒక వాటాలో కాపురముంటున్నాడు. వాకిటలో మోటారు కారు నిల్చిఉంది. ఆ ఆసామి మేడమీది గదిలో ప్రొప్రయిటరుతో సంభాషిస్తున్నాడు. సీతానాధరావు ఒక కంటితో మేడవైపు చూస్తున్నాడు.

ఇంతటిలో ఒక ఆడది ఇద్దరు పిల్లలతో నీడలోకి వచ్చింది. అది గర్భదరిద్రురాలని దాని వాలకమే చెప్తూంది. పిల్లల ఒంటిని గుడ్డముక్క లేదు. పెద్దవాడు అయిదేళ్ళవాడిలాగు, చిన్నవాడు మూడేళ్ళవాడిలాగు ఉన్నారు. వాళ్ళని ఏలాగు పోషించుకు వస్తూందో ఏమిటో అని సీతానాధరావు విచిత్రపడుతున్నాడు. ఆరోజు భోజనం బహుశః అప్పుడే అయివుంటుంది. ఆ అమ్మి తనచేతిలో అణా ముసలమ్మ చేతిలో పడవేసింది పెద్దవాడు ఒక దుంప ముక్క, ఒక బోండా తీసుకొన్నాడు. చిన్నవాడికోసం ఆమె ఒక బోండా, గుగ్గిళ్లు తీసుకొంది. చిన్నవాడు నెమ్మదిగా సాధిస్తున్నాడు. ఆ అమ్మి భోజనం మాట తెలియదు. ఇంతటిలో పెద్దవాడు చిన్నవాడి గుగ్గిళ్లలో చెయ్యి పెట్టేసు. చిన్నవాడు కెవ్వున కేకవేశాడు. వాడి ఏడుపుకి హద్దులేదు. కన్నీళ్ళు కాలవ అయేటట్లు ఏడుస్తున్నాడు. తల్లి ఓదార్చబోయింది, కాని వాడి దుఃఖం ఆగడంలేదు. దానికి విసుగెత్తి రెండు చరిచింది, వాడి ఏడుపు రెట్టింపయింది. సీతానాధరావు ఈ దృశ్యం చూసి విచారిస్తున్నాడు. అతనికళ్లు ఎదుటి మేడవైపు అప్రయత్నంగా పోతున్నాయి. ధనంజయమూర్తి ఆ కంపెనీని అమ్మివెయ్యదలుచుకొన్నాడు. బేరం కుదిరితే తీసుకొందామని సీతానాధరావు ఆలోచన. ఆ మోటారు కారు ఆసామి వెళ్లిపోయేక తాను వెళ్ళి మాట్లాడుదామనుకొంటున్నాడు.

ఇంతటిలో ఇద్దరు ఆడ తాపీపని కూలీలు వచ్చేరు. నెత్తిమీద నీళ్లు, దుమ్ము పడకుండా తలమీంచి గుడ్డలు, మోకికి చుమ్మలు కట్టుకొన్నారు. ముసలిదానిదగ్గర వాళ్ళలో ఒకర్తె రొక్కానికి, మరొకర్తె అరువుకి కొనుక్కొని వెళ్ళేరు.

మరొక ఆడది వచ్చింది. ఆ చుట్టుపట్లే కాపురముంటోన్న దానిలాగు కనబడింది. అది అరువుకి ఏవో కొని తీసుకొని లెక్క చెప్పి వెళ్ళింది. అంటే రోజూ ఈ ముసలిది ఇక్కడే వ్యాపారం చేస్తూందన్న మాట!

అక్కడికి వేరుసెనగకాయ అమ్ముకొనే ఆడపిల్ల ఒకర్తె వచ్చింది. ముసలిది దానిమీద

కుక్కలాగు పడిపోయింది. దానికూడు పడిపోతుందని దాని భయం. ఆ పిల్ల కొంచెం దూరంగా వెళ్ళి గంప దించుకొని కూర్చుంది.

సీతానాథరావు ఎక్కడికక్కడే జీవితముంటుంది కదా అని మననం చేస్తున్నాడు. కిందపడ్డ పిసళ్ళకోసం ఒక కుక్క అక్కడ అక్కడా వాసన చూస్తూంది. అంత జాగ్రత్త మనుష్యులక్క డెవరూ లేరు. సీతానాథరావు పర్సులోంచి బేడకాసు తీసేడు. ముసలి దాని ముందు పడవేసి ఒక అణా బోండాలు ఆ కుక్కకి పడవెయ్యమన్నాడు. ముసలిది బోండాలు అతని చేతికి అందియ్యబోయింది. అతని ఒళ్లు జలదరించింది. ముసలమ్మనే పడవెయ్యమన్నాడు. ఆమె కింద పడవెయ్యడంతోనే కుక్క నోటిలో కుక్కుకొని, దూరంగా ఒక గోడవారకిపోయి, మళ్ళీ వాటిని కింద పడవేసి ఫలహారం చేసింది.

పక్కనే వున్న స్టేజిదగ్గిరకి ట్రిప్లికేన్ వెళ్ళే బస్సు వెళుతూంది. బస్సులో సీతానాథరావు ముఖ్యస్నేహితుడొకడు కనబడ్డాడు. అతను గభాలున వెళ్ళి బస్సు నందుకొన్నాడు. ముసలిది ఉత్తేజపడింది "అయ్యో సిల్లర అట్టుకెళ్ళడం మరిచిపోయేడే!" అనుకొంది.

నాలుగురోజులయింది. సీతానాథరావు అదే వేళకి, అదే చెట్టుకిందికి వచ్చేడు. ముసలిది తనకి అణా బాకీ ఉందని అతను ఎరుగును. తీరా అడిగితే అది లేదంటుందేమో? ఒక్క అణాకి ఎందుకువచ్చిన గొడవ అని ఊరుకొన్నాడు. ఎదుటి మేడ ముందు కారు నిలబడివుంది. కారు వెళిపోగానే తాను లోపలకి వెళ్ళదలుచుకొని అటువైపు చూస్తున్నాడు.

ముసలిది "బాబూగారండీ!" అంది.

"ఏమీ?"

"నాలుగురోజుల క్రితం బాబుగారు బేడ ఇచ్చి అణా సిల్లరట్టుకుపోడం మరిచి పోనారండి!"

"నీకు జ్ఞాపకముందా?"

"అయ్యో! బాబయ్యా! అంత అన్యాయముంటుందండి ఎక్కడైనా! ఈ డబ్బుకోసం గడ్డి తినేరకం కాదండోయి. నాకు తెలీకపోతే ఒకరిని సూసేనా నేర్చుకోవద్దటండి బాబయ్యగారు!"

"ఎవరిని చూసి?" అని యథాలాపంగా అడిగేడు.

"ఎదుటింటి మేడ వారిని సూసేనా నేర్చుకో వద్దంటండి!"

సీతానాథరావు ఆశ్చర్యపోతూ "ఎదుటి మేడను చూసి ఏమి నేర్చుకోవాలి?" అన్నాడు.

"ఎదుటి మేడలో కంపెనీ పెట్టిన ఆసామిని ఇంతప్పటినుంచి ఎరుగుదునండి! నా దగ్గిరే మసాలవడలు కొనుక్కొని ఇక్కడే తిని పోతూండేవాడు. అప్పుడు ఉద్యోగం సద్యోగం లేదండి. కాని ఎలాగో వాళ్లని వీళ్లని బుట్టలో వేసి అప్పు తెచ్చేడు. వాటిని ఎగకొట్టి కంపెనీ పెట్టాడండి. దానిని మరొకళ్ళకి అమ్మేశాడు. ఇలాగు ఇప్పటికి నాలుగుసార్లు మారిందండి అయ్యగారూ! పాపపు సొమ్ము పాపపు సొమ్మే! ఇప్పుడాయనకూడ అమ్మెయ్యాలని సూస్తున్నాడండి. ఇంకెవరి ప్రారబ్ధ మెలాగుందో!" అంది.

సీతానాథరావు విస్తుపోయేడు. ఎరగకుండానే ముసలిది తనకేదో బోధిస్తున్నట్లయింది. ఆలోచనలలో ఉండగానే ట్రిప్లికేన్ వెళ్ళే బస్సు వచ్చింది. దాని నందుకొన్నాడు.

దక్షిణ ఆఫ్రికాలోని ప్రెటోరియానగరంలో కోళ్ళను పెంచే హెచ్. జె. డిబీర్ అనే ఆయన యిటీవల ఆసుపత్రికి చేర్చబడడానికి కారణం ఆయన పెంచే కోళ్ళలో ఓ పుంజు అతని కాలిలోని రక్తనాళం తెగేట్టు బలంగా తన్నడమట! తర్వాత కొన్నాళ్ళకే అదే పుంజు డిబీర్ సోదరుడికి ఆ మర్యాదే చేసిన ఫలితంగా ఆయన ఆసుపత్రిలో రెండువారాలు ఉండాల్సి వచ్చిందట.

—(టైమ్స్ ఆఫ్ ఇండియానుండి)